కథ

# బ్రేకింగ్ న్యూస్

-ఎన్.కె.రామారావు

సుందర్రావుకు చెవిటి సుందర్రావనే బిరుదొకటి వుంది. ఒక ప్రభుత్వ శాఖలో ముప్పైమూడేళ్ళు డిస్పాచ్ సెక్షన్‌లో పనిచేసినట్లు నటించి వారం రోజుల కిందట రిటైరయ్యాడు. ఒకాయన సుందర్రావు గురించి అతని సమక్షంలోనే ఒక అవమానకరమైన వ్యాఖ్య చేశాడు. ''అసలు నన్నడిగితే డిస్పాచ్ ఒక సెక్షనే కాదంటాను. దాంట్లో మీరు వూడబొడిచిందేముంది? మీ పేరు ఆంధ్రదేశంలో ఎవరికైనా తెలుసా? ఊహూ! లేదే. మీరు నాలాగా కవులా- ఉపన్యాసకులా? ఏదీ కాదే! 'అంచేత మీ జీవితం దాదాపు వ్యర్థమనే చెప్పుకోవాలి' ఏమిటి. నా బొంద. నేనే నలుగురికి చెప్పి తీరతాను'' భీషణ ప్రతిజ్ఞ చేశాడు. ''అలా కాదులెండి. నాలాగా అంతకాలం ఒకే సెక్షన్‌లో పని చేయకుండా, చేసినట్లు తలపింపచేయడం, అల్లాటప్పా పనికాదు. అంత చాకచక్యంగా, కళాత్మకంగా, విజయవంతంగా సర్వీసు పూర్తి చేయడం. అదేదే బుక్కులోకి ఎక్కవలసిన విషయం కాదంటారా?'' మర్మమెరిగి మెచ్చుకుంటాడని ఆశగా చెప్పాడు.



"ఎవరు మాత్రం పనిచేశారు? నేను చేశానా? హాయిగా కవిత్వం రాసుకునేవాణ్ణి. మీదంతా గొప్ప విషయం కాదులెండి'' చప్పరించేశాడు. సుందర్రావుకు ఏడుపు ఎగతన్నుకు వచ్చింది.

"మరైతే ఈ రోజు నుంచి నేనూ కవిత్వం రాస్తాను. అదేమైనా బ్రహ్మ విద్యా? కవిత్వం గురించి నాకు ఉపయోగపడే సూచనలేమైనా ఇస్తారా?''

"అలా అన్నావు. భేష్షైన మాట. నువ్వు రాసేదీ ఏ రకమైనా కవిత్వమైనా సరే! దాంట్లో ఉన్మలన, ప్రాసంగికత,మూడోది మరేదోవుంది. ఈ మూడు నీ కవిత్వంలో కనిపించేలా జాగ్రత్తపడు''

"ఇపుడు మీరన్న మాటలకర్థం. చెబుతారా?''

"అర్థం నాకూ తెలీదనుకో. అది వేరే విషయం. కానీ అవి నా కవితల్లో ప్రజ్వరిల్లుతూ ప్రముఖంగా కనిపిస్తాయని స్థానిక ఏకైక విమర్శకుడు 'కాంగామె' గారన్నారు. ఆయనన్నారంటే అవి వుండి తీరాల్సిందే. కాంగామె గారంటే అల్లాటప్పా మనిషనుకుంటున్నారేమో. కాంతమ్మ గారి మొగుడు. మా కాలనీలో పుణ్యం కొద్దీ స్వయంభువుగా వెలిసిన మహా విమర్శకుడు'' భక్తితో నేత్రాలు అర్ధ నిమీలితలయ్యాయి.

"కాంగామె చెప్పినా కంగారూ చెప్పినా అవేమిటో తెలియకుండా ఎలా వుంచి చావడం. కవిత్వం నాకు అచ్చిరాదులెండి'' సుందర్రావు విసుగ్గా చెప్పాడు. చెప్పాడే కాని నలుగురిలో గుర్తింపు తెచ్చుకోవాలన్న కోరికను మొదలంటా అణచలేకపోయాడు. రకరకాల ఆలోచనలు అక్వేరియంలో చేపపిల్లల్లా మెదడులో ఈదులాడుతున్నాయి. తన పెళ్ళి శుభలేఖలో తప్ప తన పేరు ఎక్కడా అచ్చు కాలేదు. ఉన్న ఒక్క కొడుకు పెళ్ళి చేస్తే వాడి శుభలేఖలో'' ఆగమనాభిలాషులు'' గా తనపేరూ భార్యపేరు అచ్చులో చూసుకోగలడు. కానీ వాడు ఎవరినో ప్రేమించి పెళ్లి చేసుకుని, దీవించమని వస్తే దీవించాలా వద్దా? దృశ్యం కళ్ళ ముందు కట్టి గుండె ఝల్లుమంది. దీవించడమా, మానడమా? మీమాంసలో పడి భార్య అభిప్రాయం అడిగాడు.

"మనోడికి అంత సీను లేదు లెండి. వాడిది అచ్చు మీ పోలికే! ఏ దురదృష్టపు పిల్లనో తెచ్చి బల వంతంగా మూడుముళ్ళేయించాల్సిందే'' ఆవిడ గతం గుర్తుకొచ్చి కన్నీళ్ళు పెట్టుకుంది. సుందర్రావు బాధపడలేదు. అప్రియమైన మాటలను చెవిలోకి దూరకుండా అడ్డుకోగల శక్తిని యోగసాధన ద్వారా అలవర్చుకున్నాడు. రుణదాత అప్పు తీర్చమని అడిగినా, అధికార్లు తనకిష్టం లేని పని పురమాయించినా చెవుడు ఠకీమని ప్రత్యక్షమవుతుంది. దాంతో అతనికి సుందర్రావనే బిరుదొచ్చింది.

సుందర్రావుకు ఒక ఆలోచనొచ్చింది. చేతకాని కవిత్వాన్ని ఆశ్రయించటం ఎందుకు? పట్నంలో పలు కాలనీల్లో అనేక సమస్యలున్నాయి. ఆ సమస్యలకు రేఖా ప్రక్రియలో స్థానిక పత్రికల్లో వేయించ గలిగితే చాలు. తన పేరు అందరికీ తెలిసిపోవడమే కాకుండా అధికారుల పాలిటి సింహస్వప్నమై అలరారుతుంది. వెంటనే తన కాలనీలో ''మురికి గుంటలు పరిఢవిల్లుతున్న దోమల సంస్కృతి- సంతతి'' అని పేరు తనే పెట్టాడు.

స్థానిక పత్రిక సంపాదకుడికి నమస్కారం పెట్టి లేఖ విషయం ప్రస్తావించాడు. సంపాదకుడు ససేమిరా ప్రచురించనని చెప్పాడు. ''ఏం! ఒక్క లేఖ ప్రచురించలేరా! చదవకుండానే తిరస్కరిస్తున్నారే!'' సుందర్రావు గొంతులో రోషం ప్రతిధ్వనించింది.


''మీ చంకలోనున్నది లేఖ అనే భ్రమలో మీరున్నారు. బహుశా అది గాధాసప్తశతో, సహస్ర శిర చ్ఛేద అపూర్వ చింతామణో అని నా వివేకం నన్ను హెచ్చరిస్తున్నది'' నేను సరళ గ్రాంధికం మాట్లాడుతాను. మరేమీ అపార్థం చేసుకోకండి'' సంపాదకుడు చెప్పాడు.

''బాబ్బాబు. ఇది చాలా విలువైన లేఖ. ప్రచురించండి. పారితోషికం ఏమీ అడగను'' సుందర్రావు బతిమిలాడాడు. '' ఓహో! పారితోషికం ఆలోచన కూడా ఉందా? భలేవారే! సరే, రోజుకు రెండు లైన్ల చొప్పున దాదాపు సంవత్సర సామాగ్రి- మీరే నాకేమిస్తారో- అంటే పత్రిక మనుగడ నిమిత్తం, ఏమిస్తారో చెప్పండి'' సుందర్రావు తన ఫిగర్ చెప్పాడు. సంపాదకుడు సంతృప్తి పడ్డాడు. రోజూ తన సంపాదకీయం కింది భాగంలో రెండు లైన్ల చొప్పున ప్రచురిస్తానని హామీ ఇచ్చాడు. ఆ రెండు లైన్లు హేతువాదులకు కఠినశిల సదృశ్యమైన వాస్తవంలాగా, ఆధ్యాత్మిక వాదులకు ఉపనిషత్ వాక్యంలా కనిపించే ఆస్కారముందన్నాడు. ఉదహరణకు '' మీరు మురికిగుంటలు-జుమ్మనే దోమలు అని రాశారు. అది వాస్తవంగానూ కనిపించవచ్చు. మరొకలా అంటే, మనసు ఒక మురికిగుంట. జుమ్మనే దోమలు దాన్నావహించే కోరికలు. ప్రస్తుతం దోమలను సమూల నాశనం చేయడానికి మందు లేనట్లే కోరికలను అదుపు చేసే కళ్ళెం లేదు. ఒకవేళ ఉందయ్యా అంటే అది భగవంతుడి మీద భారం వేయడమే! మళ్ళీ దీంట్లో ఒక తిరకాసుందండోయి. మీరు రాముడు దేముడంటారు, మరొకరేమో రాముడు గీముడు అంతా మిథ్య. వున్నాడనేది మీ విశ్వాసం మాత్రమే అంటారు'' సుందర్రావు చెప్పిన ఫిగర్ వినగానే సంపాదకుడికి సంతోషంతో వాగ్ధార పెరిగి సుళ్ళు తిరుగుతున్నాయి. సుందర్రావుకు ఈ వ్యవహారశైలి ఏ మాత్రము నచ్చలేదు. ఎదురు పెట్టుబడితో ఎన్నాళ్ళు లాగుతాం. పేరు తెచ్చుకోవడానికి మరో వ్యవహారం- ఖర్చు లేనిది, చూసుకోవాలి.

★ ★ ★

మర్నాడు సుందర్రావు రోడ్డున పడి అయిదు నిమిషాలు నడిచేసరికి ఒక పక్కనున్న ప్రైవేటు ఆసుపత్రిలో నుంచి ఇద్దరాడవాళ్ళ రోదన ధ్వనులు వినిపించాయి. అటు అడుగు వేసే లోగా తనని దాదాపు కిందపడేలా తోసేస్తూ ఒక వీడియోకెమెరా వాడూ, చేతిలో నోటు బుక్కు నల్లగొట్టం వున్న వాడొకడు ఆసుపత్రిలోకి మెరుపు వేగంతో పరుగెత్తటం చూశాడు. తాను పరుగెత్తాడు. నోటు బుక్కు వాడు మైకు గొట్టం ఏడుస్తున్నావిడ ముందు పెట్టి ' 'ఎందుకేడుస్తున్నారమ్మా?'' మృదువుగా అడిగాడు. ''ఏమీ లేదయ్యా, మేమిద్దరం అక్కాచెల్లెళ్ళం. మా నాయన చనిపోయాడయ్యా'' నోటు బుక్కు వాడు ఊరుకోలేదు. ''డాక్టర్లు సరిగ్గా చూడలేదా?''

''కాదయ్యా, మా నాయనకు తొంభై అయిదేళ్ళు నాకు డెబ్భై. మా చెల్లెకు అరవై- పైన అయిదేస్కో- వుంటాయి. కాలం తీరి చచ్చిపోయినాడయ్యా'' అంది. ఈ జవాబు కెమెరాకు కానీ, నోటు బుక్కుకు కానీ నచ్చలేదు. ముఖం చిట్లించారు. వాళ్లిద్దరూ ఒక ఛానెల్ రిపోర్టరు, కెమెరామెన్. సుందర్రావుకు పరిస్థితి అర్థమైంది. పెద్దావిడను ఒక పక్కకు తీసుకెళ్ళి మాట్లాడాడు. తిరిగొచ్చి''రిపోర్టరూ...నీ పేరేంటి.. బల్వంతసింగా..పేరు బలేగుందే! సరే ఆ గొట్టం నా చేతికియ్యి'' అదేశించాడు. గొట్టం పెద్దావిడ మూతి దగ్గర పెట్టి ''ఇపుడు చెప్పమ్మా'' అన్నాడు. ''ఏం చెప్పను నాయనోయి. అన్యాయంగా మా నాయన్ను చంపేశారు తండ్రోయి. ఈ డాక్టరు ఇంత ముదనష్టపోడు అని తెలిస్తే ఇక్కడకు



రాకపోదుము బాబోయ్'' ఏడుపు లంకించుకుంది. జనాలు పోగయ్యారు. ''డాక్టర్లు బయటికి రావాలి'' కేకలు భీకరంగా వున్నాయి. వైద్యులు బయటికి వచ్చి జనానికి సవినయంగా నమస్కారం చేశారు. ''అయ్యా! చనిపోయినతని వయస్సు 95 ఏళ్ళు. ఇపుడు దేశంలో ప్రబలుతున్న రోగాలన్నిటికి ఇతని శరీరం ఆలవాలమై కూర్చుంది. వయస్సు మీరి పోయింది. రక్తమూ లేదు. రోగ నిరోధక శక్తి పూర్తిగా నశించింది. ఆయువు తీరింది. మేం చేయగలిగింది చేశాం. మా తప్పేమీ లేదు''

సుందర్రావు ఒప్పుకోలేదు. ''సోదరులారా! వీళ్ళు సరిగ్గా వైద్యం చేసివుంటే ఈ వృద్ధుడు మరో నలభై ఏళ్ళన్నా బతికి అతి దీర్ఘాయుష్షు కల భారతీయుడిగా మన దేశానికి పేరు తెచ్చేవాడు. ఈ వైద్యులు అలాంటి సువర్ణావకాశాన్ని దక్కకుండా చేశారు'' రెచ్చిపోయిన జనం గందరగోళం సృష్టించారు. పోలీసులు రంగప్రవేశం చేసి బాష్ప వాయు ప్రయోగం చేశారు. దాంతో ఊరుకోకుండా లాఠీఛార్జి జరిపారు.

ఆ సాయంత్రం ఛానెల్‌లో న్యూస్ చూపించారు. ''డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఒక నిండు ప్రాణం బలైంది. జనం గోల చేశారు. పోలీసులు రంగప్రవేశం చేశారు'' అని చెప్పారు. 'ప్రస్తుతం పరిస్థితి ఎలా వుంది సింగూ?' న్యూస్ రీడర్ అడిగాడు. ''నిజమే, పోలీసుల ప్రవేశంతో పరిస్థితి తాత్కాలికంగా సద్దు మణిగింది. ఈ ప్రశాంతత తుఫాన్ ముందు పరిస్థితిలా వుంది గంగూ'' సుందర్రావే జవాబు చెప్పాడు. న్యూ.రీ. ఉలిక్కిపడి ''నాపేరు గంగు కాదు'' అన్నాడు అనుమానంగా. ''కాకపోతే మరేం కొంప మునగదులే. ప్రాస కోసం అలా అన్నాను. సర్దుకో'' సుందర్రావు కసిరాడు. న్యూ.రీ.కి కోపం వచ్చినా, గొడవ చేస్తే ప్రేక్షకులు నవ్వుతారనే భయంతో ప్రశ్నలు కొనసాగించాడు. ''పోలీసులు తమ హద్దుల్లోనే గొడవనణిచారా! కొంచెం అతిగా ప్రవర్తించారా సింగూ!''

''ఆ! కొంచెం ఓవర్ యాక్షన్ చేశారు. లాఠీఛార్జి అక్కర్లేదు. అధికారులు అప్రమత్తంగా వుంటే పరిస్థితి చేయి జారేదీ కాదు గంగూ'' న్యూస్ రీడర్ మళ్ళీ ఉలిక్కిపడ్డాడు. సింగు గింజుకుంటున్నాడు.

''నువ్వు చచ్చి పిడికెడు దుమ్మైనా మైకు గొట్టం నీకివ్వను'' అంటూ సుందర్రావు మళ్ళీ మొదలు పెట్టాడు.

''డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షాలన్నీ రేపు సంపూర్ణ బందుకు పిలుపునిచ్చాయి'' న్యూస్‌రీడర్‌కి అనుమానం వచ్చింది. గొంతు బలవంతసింగులా లేదు. మొహం వేరేలా వుంది. సింగు ముఖం ఎలా ఉంటుందో ఊహించడానికి కళ్ళు మూసుకుని గట్టిగా ప్రయత్నించాడు. కానీ సింగు రూపం కళ్ళక్కట్ట లేదు. ఆ రాత్రి టీవీలో తన ముఖం చూసుకుని సుందర్రావు చాలా ఆనందించాడు. ఈ మధ్యకాలంలో ఈ వూరు నుంచి ఇంత మంచి వార్తలు లేవు. వచ్చిన అవకాశాన్ని సుందర్రావు లాగేసుకున్నాడు. ఆ రాత్రి దుఃఖంతో కుమిలి కుమిలి ఏడ్చాడు సింగు.

పొద్దునే సుందర్రావు వచ్చి ''ఈ రోజు నుంచీ నేను బృందనాయకుడినోయ్. ఇగమూడు నా సామి రంగా ఏం జరుగుతుందో'' ''నాకేమిటీ లాభం'' బలవంత్ గునిశాడు. ''నీ జీతం నీకొస్తుందిగా. అది తీసుకో నాకక్కర్లేదు. కొంచెం నా ముఖం బుల్లితెర మీద కనబడనీయ్'' సుందర్రావు కొంచెం కసురుకున్నాడు.

రెండ్రోజుల వార్తాన్వేషణ తర్వాత సింగు బృందానికి నేత్రపర్వమైన దృశ్యం ఒకటి కంట బడింది. వాళ్ళ కళ్ళ ముందే ఒక స్టీరింగు ఆటో తిరగబడింది. చెట్టు మీది కాయల్లా ఓ నలుగురు నేల మీద పడిపోయారు. వాళ్ళ నడ్డి మీద ఆటో పడింది. విచిత్రంగా వాళ్ళు తమను బయటికి లాగడానికొచ్చిన జనాన్ని తిడుతున్నారు. సుందర్రావును చూడగానే మైకు గొట్టం నాకంటే నాకని పోటీపడసాగారు. సుందర్రావు బృందం వాళ్ళను బయటికి లాగడానికి ప్రయత్నిస్తున్న జనాన్ని ఆపి, నడ్డి మీద ఆటో నిలుపుకున్న వాళ్ళలో ఒకడి చేతికి గొట్టం ఇచ్చాడు. వాడు మొదలుపెట్టాడు. ''ఆటో నడిపేటోడు ఎట్లుండాల? ఓవర్‌లోడ్ వద్దురా అంటే అంటే వినకోవాల. జనాన్ని మేకల మందలా కూర్చోబెట్టిండు. ఏం లాభం''

సుందర్రావు మోకాళ్ళ మీద కూర్చుని ''ఈ ప్రమాదం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం వుందని భావిస్తున్నారా?'' రెండవ క్షతగాత్రుడు మొదటివాడి దగ్గర మైకు గొట్టం నిర్దాక్షిణ్యంగా లాక్కుని, ''అక్షరాలా. నూటికి నూరు పాళ్ళు నిర్లక్ష్యమే కారణం.రవాణా అధికారులు ఇలాటి బళ్ళకు లైసెన్సులు ఇవ్వకుండా డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేయాలి. పోలీసులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నిస్తున్నాం'' అక్కడ కొచ్చిన పోలీసుని చూసి. గొట్టం పక్కవాడి చేతిలో పెట్టేసి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. ''నాకు లైసెన్సు ఉంటేగా రద్దు చేయడానికి'' ఆటో డ్రైవరు అసంకల్పితంగా అనేసి నాలిక్కరుచుకున్నాడు. పోలీసులు ఆటో లేపడానికి ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళని మరో అయిదు నిమిషాలు ఆటోను అలాగే వుంచమని, ఇంకొన్ని ప్రశ్నల తర్వాత బాధితులంతా సుందర్రావు పక్షమే మాట్లాడి యధాతథ స్థితిలో గొట్టంలో మాట్లాడారు. ఆ తర్వాత ఆటోను తొలగించి డ్రైవరును అరెస్టు చేశారు. బరువు తమ మీంచి తొలగగానే, మైకు మాయం కాగానే బాధితులకు గాయాల నొప్పులు తెలిసొచ్చాయి. డ్రైవరును నాలుగు దెబ్బలు పీకడంతో ఆటోల సమ్మె మొదలైంది. ఊరు పెద్దదైనా సిటీ బస్సులు వేయని ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. మళ్ళీ ఒక సంపూర్ణ బంద్‌కు పిలుపు వచ్చింది.

ఆ రాత్రి న్యూస్ రీడర్ అడిగిన ప్రశ్నలకు సుందర్రావే జవాబులు చెప్పాడు.

''ఆఖరి ప్రశ్న. ఇక్కడ కుండపోతగా వర్షం కురుస్తోంది. అక్కడెలాగుంది సింగూ''

''కుండపోతగా లేదు కానీ, చిన్న బిందెపోతగా వర్షం వుంది గంగూ'' సుందర్రావు ధీటైన జవాబుకు న్యూస్‌రీడర్ అదిరిపోయాడు. ఛానెల్ వాళ్ళు సింగు మొహం దాదాపు మరిచిపోయారు. ఎవడైతేనేం మంచి న్యూస్ ఇస్తున్నాడు. కాకపోతే కాస్త నోటి దురుసు. టీ.వీ. ప్రేక్షకులకు సుందర్రావు మొహం అలవాటైపోయింది. అతనికి బాధ ఒకటే. ముఖం తనది పేరు సింగుది. అంచేత అయిన వాళ్ళ దగ్గర కానీ వాళ్ళ దగ్గర తన అసలు పేరు సుందరసింగు అనీ, స్కూల్లో చేర్పించేటప్పుడు ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం ఫలితంగా సుందర్రావుగా నమోదయిందని, తనే ఛానెల్ వాళ్ళకు మాటామంతీ మధ్య అసలు విషయం తెలపడంతో వాళ్ళే చొరవ తీసుకుని మళ్ళీ సుందరసింగుగా తన్ను ప్రతిష్టించారని చెప్పుకొస్తున్నాడు. ''మరి బలవంతసింగేమయ్యాడు?'' ఒక కుతూహలరావు అడిగాడు. ''అబ్బే వాడికి న్యూస్ ఎలా పుట్టించాలి. దానంతటది అదే పుట్టిన న్యూస్‌ను ఎలా న్యూస్ వర్దీ చేయాలి. తెలిసి చావదు. దాంతో వాడిని నా అనుచరుడిగా మార్చి శిక్షణ ఇస్తున్నా'' బలవంత సింగూ ఏడుపు ఆపుకోలేక పబ్లిగ్గా చిన్నపిల్లాడిలా ఏడుపు మొదలెట్టాడు.

ఊళ్లో ఏ ప్రమాదం జరిగినా ముందుండేది సుందర్రావు బృందమే. వరకట్న బాధితురాలు ఆత్మహత్య చేసుకుందన్న సంగతి పిల్ల తండ్రి పోలీసులతో పాటు వీళ్ళకూ చెబుతాడు. వీళ్ళే ముందు ఘటనాస్థలికి చేరుకుంటారు. కూతురు శవం పక్కనే కూలబడి శోక సాగరంలో వున్న తల్లిదండ్రులను వీళ్ళు మైక్‌లో మాట్లాడిస్తారు. తమ స్పందన తెలియచేయాల్సిందిగా కోరతారు. ఆశ్చర్యంగా ఆ పిల్ల తల్లిదండ్రులు గొట్టంలో మాట్లాడటానికి ఏ మాత్రం విముఖత చూపరు. కొత్త సినిమా విడుదలనాడు 'క్యూ' లో జరిగిన తొక్కిసలాటలో ఎవరన్నా మరణిస్తే వీళ్ళు ముందుగా ప్రత్యక్షమవుతారు. సోదర ప్రేక్షకులతో గొట్టంలో మాట్లాడించి థియేటర్ యాజమాన్యాన్ని దుయ్యబట్టిస్తారు. బాధితులు తమ బాధను పక్కకు పెట్టి దీంట్లో మాట్లాడటానికి ఉత్సాహం చూపడం వెనక గల కారణాలను ఒక మానసిక శాస్త్రవేత్త తన పరిశోధనాంశంగా ఎంచుకున్నాడు. రోడ్డు దాటబోయి చిన్న కుర్రాడిని లేపడానికి బదులు వాడి మూతి దగ్గర గొట్టం పెట్టి, స్కూలు యజమాన్యాన్ని ప్రశ్నించడం సుందర్రావుకు అలవాటైపోయింది. పిడుగు పాటుతో చనిపోయినవాడి తండ్రి మూతి దగ్గర గొట్టం పెట్టి, అతనితో ఈ చావుకు ప్రభుత్వం బాధ్యతవహించవలసిందే అని చాటగలిగే చైతన్యాన్ని నింపగలిగారు.

రెండు రోజుల పాటు వూళ్ళో ఏ ప్రమాదమూ జరగలేదు. సుందర్రావుకు ఒక ఆలోచన వచ్చింది. ''ఒరేయ్ బల్వంతం- మన మాజీ ఎమ్మెల్యే గారింటికి వెళ్ళి వారి దినచర్యలో ఒక భాగం చిత్రీకరించి దానికి మన భాష్యం కలుపుదాం'' అన్నాడు.

''వద్దు వద్దు. వాడి దగ్గర తుపాకీ వుంది. తేడా వస్తే రియల్టర్లు ఒకడిని ఒకడు కాల్చుకున్నట్లు-

మనల్ని వాడు కాల్చినా కాల్చగలడు. పైగా మనం నిరాయుధులం'' బల్వంత్ వద్దన్నాడు. సుందర్రావు బలవంతంగా బృంద సభ్యులను మాజీ గారింటికి తీసుకెళ్ళాడు. అక్కడ తను దర్శకత్వం వహించి మాజీ గారి భార్యను భర్తకు ఒయ్యారంగా 'టీ' ఇవ్వమన్నాడు. ఆవిడ అలాగే చేస్తుండగా రమ్యంగా చిత్రీకరించాడు. ''ఏవండీ, మధ్యంతరం వస్తుందంటున్నారు. రావచ్చంటారా?'' అడిగాడు. ఉత్సాహంగా ''రావచ్చేమిటండీ. దాపుల్లోకి వచ్చేస్తేనూ'' అన్నాడు మాజీ. ''రోజూ మీ భార్య గారే మీకు టీ అందిస్తారా?''పొంతన లేని ప్రశ్న వేశాడు. ''అబ్బే లేదండీ! ఎప్పుడో మధ్యంతరం లాగా రెండేళ్ళకోసారి అన్నమాట'' మాజీ చమత్కరించాననుకున్నాడు. ఆ సాయంత్రం వార్తల్లో మాజీ గారి భార్య టీ ఇవ్వడం చూపారు. తర్వాత ''రోజూ మీ భార్యగారే టీ అందిస్తారా? ''అబ్బే లేదండీ, ఏదో ఇలా మధ్యంతరం'' తర్వాతమాట కట్ అయింది. వ్యాఖ్యానం మొదలైంది. ''మధ్యంతరం అనగానే ఉత్సాహంతో భర్త అడుగులకు మడుగులొత్తుతున్న వారి సతీమణిని చూశారు. వ్యాఖ్యానం సాగుతుండగానే ''మధ్యంతరం తిరిగి తెచ్చిన అన్యోన్యత'' అక్షరాలు కనిపించాయి. పొద్దునే తుపాకీ తీసుకుని సుందర్రావు బృందాన్ని కాల్చేద్దామనే సదుద్దేశ్యంతో మాజీ గారు ఇల్లు వదిలారు. ఈ ముగ్గురూ కనబడగానే ''ఒరేయి, సుందరం- సింగూ వగైరాలూ. ఆగండ్రా కాలుస్తా. నాకు చూపు సరిగ్గా ఆనదు. అక్కడే కదలకుండా నిలుచోండి. కదిలితే గురి తప్పొచ్చు'' హెచ్చరించాడు. అంత దూరం నుంచి తను మనిషిని కాదుకదా మర్రిచెట్టును కూడా గురి చూసి కొట్టలేడు.

భయంతో సుందర్రావు, బలవంత్ సింగూ, కెమెరావాడు పరుగుపరుగున రోడ్డు దాటుతుండగా, ఒక లారీ సుందర్రావును గుద్దేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. సుందర్రావు స్పృహ కోల్పోబోతూ మైకును మూతి దగ్గరికి తెచ్చుకునే లోగా బలవంత్ లాగేసుకుని వంకర నవ్వు నవ్వాడు. సుందర్రావుకు స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో ఒళ్ళంతా కట్లతో వున్నాడు. కళ్ళు, మూతి భాగాలు కట్టు లేకుండా వున్నాయి. గొట్టం తెమ్మని సైగ చేస్తే బలవంత్ వినిపించుకోనట్లుగా వెళ్ళిపోయాడు. సుందర్రావుకు దుఃఖం ఆగట్లేదు. ''ఇది ఆసుపత్రి?'' మళ్ళీ లోపలికి వచ్చిన బల్వంత్ హీన స్వరంతో అడిగాడు. ''మనిద్దరం మొదటిసారి కలిసిన ఆస్పత్రి''

సుందర్రావు ఒళ్ళు ఆసాంతం వణకటం మొదలైంది. ''ఆనాటి కోపంతో నన్ను చంపేస్తావేమోరా'' సన్నగా వినీ వినిపించనట్లుగా గొణిగాడు. ఆ పక్కనేవున్న డాక్టర్''వృత్తి ధర్మాలుంటాయండీ. ఏ వృత్తి వారయినా సరే! వృతిధర్మాలు మరువకూడదు. మీ ప్రాణానికొచ్చినా ప్రమాదమేమీ లేదు. కాకపోతే గాయాలు మానటానికి కొంతకాలం పడుతుంది'' ప్రశాంతంగా చెప్పాడు.

''మీకు చేతులెత్తి దండం పెట్టాలనుంది. కానీ ఈ చేతులు సహకరించటం లేదే ఎట్లా'' వాపోయాడు. అవేమీ వద్దన్నట్లు డాక్టర్ సైగచేసి, వేరే రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. తనను వదిలి బల్వంత్, కెమెరా వాడు పారిపోతే, తనను ఇక్కడికి తెచ్చింది అలనాటి ప్రమాదపు ఆటోవాడు. ఇంతలో ఒక పోలీసు అధికారి వచ్చాడు. ఇతడి గురించి రెండు సార్లు ఛానెల్‌లో తను అత్యుత్సాహంతో వికృతమైన అబద్ధాలు చెప్పాడు.అతన్ని చూడగానే పై ప్రాణాలు పైనే పోయాయి. తను ఇప్పుడు ఎటూ పారిపోలేని అచేతనస్థితిలో వుండగా, లాఠీతో పిచ్చబాదుడు బాదినా తనేం చేయగలడు.

కెమెరావాడూ, బలవంత్ ఆయన్ని చూడగానే, బయట ఎవరో పిలిచినట్టు నటించి జారుకున్నారు. ఆశ్చర్యం, పోలీసాయన ''సుందర్రావుగారూ, మిమ్మల్ని హిట్ అండ్‌రన్ చేసిన లారీని ట్రేస్ చేసి, డ్రైవరును అరెస్టు చేశామండీ. మీరు డిశ్చార్జ్ అయింతర్వాత కోర్టును కాంపెన్సేషన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బై..ది..బై మీకొక మాట చెప్పాలండీ. ప్రతీ మనిషిలోనూ, వృత్తిలోనూ సమాజంలోనూ మంచీ చెడూ రెండూ వుంటాయి. మనం మంచిని చూసి దాన్ని ప్రోత్సాహించాలి. గోడ కూలి మనుషుల మీద పడితే ఆ 'డెబ్రిస్' నుంచి వాళ్ళను బయటకు లాగి సత్వర చికిత్స అందేలా చూడాలే గాని, వాళ్ళ మూతి దగ్గర మైకు పెట్టి మీ అనుభూతి ఏమిటి? మీరు ఎలా స్పందిస్తున్నారు? ఈ గోడ కూలడం వెనుక ప్రభుత్వ ప్రమేయం కానీ, నిర్లక్ష్యం కానీ వున్నాయా? ఇవండీ అడగాల్సిన ప్రశ్నలు? మీకు కీర్తి కాంక్ష ఎక్కువని మీ ఆవిడగారు చెప్పి కన్నీళ్ళుపెట్టుకున్నారు. కీర్తి కష్టపడి సంపాదించవచ్చు. గానీ మానవత్వం సంపాదించడం, నిలుపుకోవడం కష్టం. అయినా మనుషులమైనందుకు అవి సాధించాలి''

చెవిటి సుందర్రావుకు మంచి మాటలు వినబడుతూనే చెవుడు వచ్చి రెండు చెవులను ఆక్రమించింది.

★



## ఆహా! ఏమి భాష..!!

పసి పిల్లల్ని చూడండి; వాళ్ళ మానాన వాళ్ళని ఒంటరిగా వదిలివేసినా కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ఉయ్యాల్లో గిలగిచ్చకాయలతోనో, గుప్పెట్లో లక్కపిడతతోనో ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు. వారి అర్థం పర్థంలేని 'ఉగ్గూ ఉంగా'లకూ, పక్షికూనలు చేసే 'కిచ కిచ' శబ్దాలకు పోలిక ఉందంటున్నారు పరిశోధకులు. పక్షులు కూడా పాడటం లేదా మాట్లాడటం నేర్చుకునే క్రమంలో ఇలా అర్థం పర్థం లేకుండా అరుస్తాయట. ఇలా నేర్చుకొనేందుకు వాటి మెదడులో ప్రత్యేకమైన సర్క్యూట్లు కూడా ఉంటాయిట. మసాచుసెట్స్, అమెరికా పరిశోధకులు చెప్పేదేమిటంటే, ''తన శరీరాన్ని ఉపయోగించకోవడం అలవాటయ్యే మెదడు వరకూ దానిని వివిధ రకాలుగా పరీక్షించి చూసుకుంటుంది. దానిలో భాగమే ఈ 'కిచ కిచ'లు, అల్లరి చేష్టలు''.